క్లుప్తంగా

యూరియా కొరత లేకుండా చూడాలి: ఎమ్మెల్యే ప్రభాకర్



సంగారెడ్డి : రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సదాశివపేట ఏఓ రమేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి యూరియా కొరతపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని సూచించారు. యూరియా స్టాక్ అందుబాటులో ఉంచాలన్నారు. స్టాక్ ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో చెప్పులు ఉంచకుండా యూరియా సరఫరా చేయాలని కోరారు.

సమస్యలను పరిష్కరించండి

సంగారెడ్డి : నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే కలసి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఎమ్మెల్యేకి 40 శాతం మంజూరు నిమిత్తం ఎమ్మెల్యే ద్వారా పంపిన లబ్ధిదారుల ప్రతిపాదనలకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సూచించిన ఎండర్స్ మెంట్ లేఖను ఆయనకు అందజేశారు. వెంటనే తగు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారని తెలిపారు.

వినతిపత్రం అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం ఇటీవల మున్సిపాలిటీగా మారడంతో జాతీయ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగాలు కోల్పోయామని తమకు మున్సిపాటీలో ఎద్దైన ఉపాధి కల్పించాలని బుధవారం కమిషనర్ తిరుపతికి వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. గత 20 ఏళ్లుగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి సేవలందించినట్లు కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రమేశ్, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి ఎంఈఓగా రంజిత్‌కుమార్



మొక్కలు నాటుతున్న కమిషనర్

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండల విద్యాధికారిగా రంజిత్‌కుమార్ నియమికమయ్యారు. ఇప్పటివరకు ఎంఈఓగా పనిచేసిన గోవింద్ రెడ్డి గత నెల 31న పదవీ విరమణ పొందడంతో వట్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రంజిత్ కుమార్‌కు ఎంఈఓగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా మండల పీఆర్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో రంజిత్‌కుమార్‌తో పాటు మర్వెల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా నియమించిన సాయిలీలను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్‌రావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ సాయి సంతోష్ కాలనీలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో కమిషనర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణపరంగా మారుతున్న తీవ్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఆర్వో పృథ్వీ , ఆర్ఐ ప్రవీణ్, ఆర్ఐ మాధురి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెల్లాపూర్ రోడ్లపై సమస్యల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిరసన చేపట్టారు. ప్రధానంగా రహదారులు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఫ్లెక్సీ ముందు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు సెల్ఫీలు తీసుకొని దానిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు ట్విటర్‌లో పోస్టు చేస్తున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

జహీరాబాద్ టౌన్: విద్యాతో పాటు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్గి ఉండాలని టాస్క్ జిల్లా మేనేజర్ రావుల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నైపుణ్య శిక్షణ తరగతుల ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అందుకని టాస్క్ ద్వారా ఇచ్చే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్, వే ఆఫ్ అండర్ స్టాండింగ్, లింజినింగ్ స్కిల్స్‌పై అవగహన కల్పించారు.



శుభ్రం చేస్తున్న సమయంలో కారిడార్‌లో ఆగిన మహిళలు



ఎక్స్‌రే కోసం పేషెంట్‌ను నీళ్లలో నుంచి తీసుకెళ్తున్న సిబ్బంది

మంత్రి వస్తున్నారని...

సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనటానికి గురువారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రానున్న నేపథ్యంలో బుధవారం ఆస్పత్రి ఆవరణ అంత శుభ్రం చేశారు. ఉదయం పూట పేషెంట్ల రద్దీ సమయంలో శుభ్రం చేయడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

గురుకులం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల పరిధి బాచేపల్లి గ్రామంలోని మినీ ఎస్టీ బాలికల గురుకులాన్ని మండల ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, ఎంపీడీఓ సంగ్రామ్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు జరుగుతున్న బోధనా తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. వండిన వంటలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా వండాలని ఆదేశించారు.

భయం భయంగా బడికి..



శిథిలావస్థకు చేరిన నాగులపల్లి ప్రభుత్వ పాఠశాల భవనం

- శిథిలావస్థలో నాగులపల్లి 'ప్రభుత్వ బడి'
- పెచ్చులూడి చువ్వలు తేలిన పైకప్పు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): ప్రభుత్వం బడుల బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా.. సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి. సదాశివపేట మండలంలోని నాగులపల్లి ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరిన భవనాల్లో విద్యార్థులు భయం భయంగా చదువులను కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ 50మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి పాఠశాలలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. కనీసం పాఠశాలలో టాయిలెట్స్ సదుపాయం కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్లాబ్‌కు ఉపయోగించిన ఇనుప ఊచలు పూర్తిగా తుప్పుబట్టి బలహీనంగా మారాయి. దీంతో శ్లాబు ఎప్పుడు పడిపోతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్లాబ్ నుంచి నీరుకారుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా పాత భవనాలకు మరమ్మతులు చేపట్టినా, మరి కొన్ని చోట్ల అధ్వానంగా మారాయి. మండలంలోని నాగులపల్లి ప్రభుత్వ పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ఉన్నతాధికారులకు అందించారు. ఎటువంటి స్పందన లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి

శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి, నూతన భవనాలను నిర్మించాలి. ఇప్పటికే పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– శంకర్, ఎంఈఓ సదాశివపేట

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పట్టణంలో ఆధునిక వసతులతో.. విశాలమైన ప్రాంగణాలలో శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న పీవీ నరసింహారావు ఆడిటోరియం, ఇంజనీరింగ్ బిల్డింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఏకీకృత భవనంలో సేవలు అందించేలా.. పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, గ్రామీణ నీటిపారుదల శాఖల కార్యాలయాల కోసం రెండు కోట్ల రూపాయలతో జీ ప్లస్ వన్ పద్ధతిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే చోట సేవలు అందిస్తాయని తెలిపారు. రూ.16కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న పీవీ నరసింహారావు ఆడిటోరియం నిర్మాణ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో సభలు, సమావేశాలు, సమీక్ష సమావేశాలు, సదస్సులు నిర్వహించుకునేందుకు వీలుగా రెండు అంతస్తులో ఆధునిక వసతులతో ఆడిటోరియం నిర్మిస్తున్నామన్నారు. అనంతరం గౌతమ్‌నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన భవనం నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల్లోగా పనులు పూర్తి చేసి సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విభాగం డీఈ సురేష్, నీటి పారుదల శాఖ డీఈ రామస్వామి, జీహెచ్‌ఎంసీ ఈఈ సురేశ్, డీఈ కృష్ణవేణి, ఏఈ శివకుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వివక్ష నుంచి బయట పడాలి



మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అస్మా

జహీరాబాద్: సామాజిక వివక్ష నుంచి బయట పడాలంటే మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని మహిళా కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షురాలు అస్మా అన్నారు. బుధవారం మండలంలోని శేఖాపూర్ గ్రామంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సంఘటితం అయితేనే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలుగుతారన్నారు. రాజకీయాల్లో చురుకుగా ఉండి సమాజం కోసం, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని అస్మా పుష్పాలు అందించి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు చన్నుబీ, తహసీం బేగం , సంగమ్మ, వెంకటమ్మ, పద్మమ్మ, లత, అస్మాబేగం, రేష్మా బేగం, మెహరాజ్‌బేగం, యాస్మిన్, హసీనా, రిజ్వానా పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ, రైతులు

వట్‌పల్లి(అందోల్): పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. బుధవారం అందోల్ మండల పరిధిలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో రైతువిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వరి, ప్రత్తి, కంది పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని గమనించారు. పురుగు ఉనికి నివారణకు ఎకరాకు 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని సూచించారు. ఎక్కువగా ఉంటే కార్టప్ హైడ్రో క్లోరైడ్‌ను లీటర్ నీటికి 2 గ్రా చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో రసం పీల్చు పురుగు నివారణకు ఫ్లోనికామిడ్ అనే మందును 0.4 గ్రా.లీటర్ నీటికి పిచికారీ చేయాలన్నారు. కందిలిలో శనగ పచ్చ పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైతువిజ్ఞాన కేంద్రం ప్రొఫెషనల్–1 శ్రీకాంత్, ఆకాశ్ గ్రామ రైతులు శ్రీకాంత్, నారాయణ, ప్రశాంత్, కిరణ్ రాములు పాల్గొన్నారు.

పశువులను కాపాడుకోండి

అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ ముస్తాక్ అలీ

కంగ్టి(నారాయణఖేడ్): పశువులకు ప్రాణాంతక లంపిస్కిన్ వైరస్ సోకుతుండటంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న టీకాలు వేయించుకొని రైతులు తమ పశువులను కాపాడుకోవాలని డాక్టర్ ముస్తాక్ అలీ తెలిపారు. బుధవారం మండలంలోని భీంరా గ్రామంలో పశువుల టీకాల శిబిరం ఏర్పాటు చేశారు. తండాలో 110 పశువులు, భీంరాలో 150 పశువులకు లంపీ వైరస్ నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, వెటర్నరీ అసిస్టెంట్లు స్వామి, మోహిన్, అలీం, మాజీ సర్పంచ్ పంతులు నాయక్, బస్వరాజ్ పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు

- అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రుల సీజ్
- డీఎంహెచ్‌ఓ నాగ నిర్మల



ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న నాగ నిర్మల

కంగ్టి(నారాయణఖేడ్): అర్హత, అనుమతి లేకుండా రోగులకు వైద్య చికిత్సలు అందజేస్తూ ధన, ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి (డీఎంహెచ్‌ఓ) నాగనిర్మల హెచ్చరించారు. బుధవారం కంగ్టి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి రెండు ఆస్పత్రులను సీజ్ చేశారు. వైద్యుల అర్హతలు, అనుమతులు, వైద్య సేవలు, కనీస వసతులు పరిశీలించారు. స్థానిక నిర్మల పాలిక్లీనిక్‌లో బీఏఎంఎస్ అర్హత ఉన్న వైద్యులు అలోపతి మందులు రాస్తుండటం, అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తునారు. ఔరాద్ రోడ్డులో కనీసం బోర్డు లేకుండా వైద్యశాల నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు ఆస్పత్రులను సీజ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఓటర్ జాబితా సిద్ధం

సంగారెడ్డి టౌన్: మండలం ఓటర్ జాబితా సిద్ధం చేసినట్లు సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్నీ గ్రామాల్లో ఓటర్ జాబితాను సిద్ధం చేస్తామని మండల వ్యాప్తంగా 19,031 ఓటర్ నమోదు ఉందన్నారు. గ్రామాల వారీగా ఓటర్ జాబితాలను పంపిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించింది. ఈ సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఐదు మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టు హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, ఒకరికి రూ. 2000, మరోకరికి రూ.1500, ఇంకొకరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

◆ నలుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఒకరికి రూ.1500, మరో ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

◆ పర్యావరణంపై అవగాహన

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పర్యావరణంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని మైహెయిర్ సీనియర్ సిటిజెన్ క్లబ్ సభ్యులు కృష్ణారావు, విజయపాల్ రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రేడియల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ సీసాలను సేకరించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు.

◆ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాపర్తిలో ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశలు చేశారు.. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంపీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తుకరాం, ఎర్ర రవి, హన్మండ్లు, బండారి సాయిలు పాల్గొన్నారు.

నీలవర్ణం అలంకరణలో గణనాథుడు



పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గణేశ్‌గడ్డ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 8వ రోజు బుధవారం గణేశ్‌గడ్డ దేవస్థానంలో అర్చకులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి, స్వామివారిని నీలవర్ణంలో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

గణనాథుడికి 121 రకాల నైవేద్యం



నైవేద్యాన్ని సమర్పించిన గోపాల్రాణి దంపతులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గజకర్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాస్త్రి రోడ్డులో నెలకొల్పిన వినాయకుడికి బుధవారం రాత్రి భక్తులు ఘనంగా పూజలు చేశారు. కాలనీకి చెందిన పద్మశాలి సంఘం పెద్దలు నాగారం గోపాల్‌రాణి దంపతులు 121 రకాల నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ప్రసాదాలకు అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజకర్ణ యూత్ సభ్యులుసాయి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఊరేగింపు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం కర్నాటక రాష్ట్ర సరిహద్దులోని ధనసరి గ్రామంలో మల్లికార్జున స్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. లోకకళ్యాణ్యం ప్రతి సంవత్సరం స్వామి వారి పల్లకీ ఉత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని పల్లకీలో గ్రామంలో ఊరేగించారు. ఉదయం ప్రారంభమైన ఊరేగింపు రాత్రి వరకు కొనసాగింది. ఆటాపాటలు, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలి: ఉమాహారతి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి సూచించారు. బుధవారం మండలంలోని మాసాన్‌పల్లి, మహదేవుపల్లిలో పర్యటించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేశారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా Ms. అక్వీజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (గతంలో SS ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్), కంపెనీల చట్టం, 2013 క్రింద నెలకొల్పబడినది మరియు 252/1, అరూర్ గ్రామం, సదాశివపేట మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ-502291 వద్ద రిజిస్టర్ ఆఫీస్ కలిగినవారు ఆర్థిక సహాయం కొరకు కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్‌ను సంప్రదించారు మరియు శ్రీ ఎలుగోయ మహాదేవ్ నుండి SRO, జద్చర్లలో నమోదైన డాక్యుమెంట్ నంబర్లు 1) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2213/1992, తేది: 13-11-1992, 2) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2216/1992, తేది: 16-11-1992, 3) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2221/1992, తేది: 17-11-1992, 4) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2223/1992, తేది: 18-11-1992, 5) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2226/1992, తేది: 19-11-1992, 6) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2227/1992, తేది: 20-11-1992, 7) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2284/1992, తేది: 30-11-1992 కలిగిన రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా Ms. అక్వీజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (గతంలో SS ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్) ద్వారా కొనుగోలు చేయబడిన దిగువ తెలిపిన ఆస్తిని తనఖాపెట్టుటకు ఆఫరు చేసారు. Ms. అక్వీజెంటా ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (గతంలో SS ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్) వారు SS ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున శ్రీ ఎలుగోయ మహాదేవ్ ఎగ్జిక్యూట్ చేసిన సేల్ డీడ్ డాక్యుమెంట్ నంబర్లు 1) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2213/1992, తేది: 13-11-1992, 2) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2216/1992, తేది: 16-11-1992, 3) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2221/1992, తేది: 17-11-1992, 4) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2223/1992, తేది: 18-11-1992, 5) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2226/1992, తేది: 19-11-1992, 6) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2227/1992, తేది: 20-11-1992 మరియు 7) సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2284/1992, తేది: 30-11-1992 లను పోగొట్టుకున్నారు / కనిపించడంలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినచో 7 రోజులలోగా దిగువ సంతకందారును సంప్రదించవలెను మరియు వాటిని దిగువ సంతకందారుకు అప్పగించవలెను. తదుపరిగా, పై సదరు ఆస్తికి సంబంధించి ఏవిధమైన స్వభావంగల ఏదైనా అభ్యంతరం, క్లెయిమ్, హక్కు, ప్రయోజనం, వివాదమును ఎవరికైనా/ ఎవరైనా వ్యక్తి/ వ్యక్తులు/ బ్యాంకులు/ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు కలిగివుంటే ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి ఏడు (7) రోజులలోగా అతని/ఆమె/ వారి అభ్యంతరం, క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం, వివాదము/ల వివరాలు తెలియజేసేందుకు డాక్యుమెంటరీ రుజువుతో అతను/ఆమె/ వారు దిగువ సంతకందారును సంప్రదించవలెను. లేనిచో నా క్లయింట్ ఎవరికైనా/ వ్యక్తి/ వ్యక్తుల యొక్క అభ్యంతరాలు/ క్లెయిమ్‌లు వివాదాల వివరాలు లేవని భావిస్తారు మరియు ఆతరువాత ఎట్టి క్లెయిమ్‌లు లేదా వివాదాలు పరిశీలించబడవు.

ఆస్తుల షెడ్యూలు: 1. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 11,132 చ.గజాలు లేదా ఎ.2.12 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **దక్షిణం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1), **తూర్పు:** సర్వే నం.249, **పశ్చిమం:** కొనుగోలుదారు భూమి. 2. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 11,132 చ.గజాలు లేదా ఎ.2.12 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **దక్షిణం:** సర్వే నం.252లో మిగతా భాగం, **తూర్పు:** సర్వే నం.249, **పశ్చిమం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1). 3. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 10,648 చ.గజాలు లేదా ఎ.2.08 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1), **దక్షిణం:** విక్రయదారు మిగతా భూమి, **తూర్పు:** సర్వే నం.251లో భూమి, **పశ్చిమం:** తలారి గంగమ్మ భూమి. 4. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 11,132 చ.గజాలు లేదా ఎ.2.12 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **దక్షిణం:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **తూర్పు:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **పశ్చిమం:** తలారి గంగమ్మ మరియు ఇతరుల భూమి. 5. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 11,132 చ.గజాలు లేదా ఎ.2.12 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **దక్షిణం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1), **తూర్పు:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **పశ్చిమం:** బోని ఈరయ్య మరియు ఇతరుల భూమి. 6. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 11,132 చ.గజాలు లేదా ఎ.2.12 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** జాతీయ రహదారి 9, **దక్షిణం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1), **తూర్పు:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **పశ్చిమం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1). 7. తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, కోనాపూర్ మండలం, అరూర్ గ్రామం వద్దగల సర్వే నం.252/1లో 11,132 చ.గజాలు లేదా ఎ.2.12 గుంటల భూమి యావత్తు మరియు సరిహద్దులు: **ఉత్తరం:** జాతీయ రహదారి 9, **దక్షిణం:** కొనుగోలుదారు భూమి (సర్వే నం.252/1), **తూర్పు:** సర్వే నం.252/1లో మిగతా భాగం, **పశ్చిమం:** రామయ్య మరియు ఇతరుల భూమి.

సం/- ఇ.ఎ. శ్రీకాంత్ రాజు, అడ్వకేట్
#202, సరళ అపార్ట్‌మెంట్స్, ఉమేష్ చంద్ర స్టాచ్యు రోడ్, యాక్సిస్ బ్యాంక్ ప్రక్కన,
ఎస్.ఆర్. నగర్, హైదరాబాద్-38, సెల్: 9959531522